## నేడు ఆమరణ నిరాహార దీక్ష



- బీఆర్‌ఎస్ నాయకుడు కర్రె వెంకటయ్య పిలుపు

యాదగిరిగుట్ట, జూన్ 14: బీఆర్‌ఎస్ హయాంలో మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాలను మల్లాపురంలోనే ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్నట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య తెలిపారు. వారంరోజులుగా బీఆర్‌ఎస్ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రిలే దీక్ష చేపట్టినా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పందించలేదన్నారు. వైద్య కళాశాల వచ్చుడో.. కర్రె వెంకటయ్య చచ్చుడో తేల్చుకుంటామన్నారు. మల్లాపురంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వైద్య కళాశాలను నిర్మిస్తామని సర్వే నంబర్ 64లో భూమిని పరిశీలించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామానికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు ఏం చేస్తున్నారో చెప్పాలన్నారు. దీక్షకు పార్టీ శ్రేణులు కదిలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

## రాజకీయ కుట్రతోనే కేటీఆర్‌కు నోటీసులు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



చందంపేట(దేవరకొండ), జూన్ 14 : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు జారీ చేయడం సబబు కాదని బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ కుట్రతోనే ఏసీబీ నోటీసులు జారీ చేసిందని ఆరోపించారు. గతంలోనే ఏసీబీ విచారణ చేశారని, మళ్లీ నోటీసులు జారీ చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఫార్ములా ఈ–రేస్‌కు సంబంధించి ఎలాంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడలేదని అన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే ఏసీబీ నోటీసులు జారీ చేశారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నించినందుకు ఇలాంటి కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు.

## ఎమ్మెల్యే ఇంట్లో వ్యక్తి
# అనుమానాస్పద మృతి!



**ఆలేరు ఎమ్మెల్యే అయిలయ్య ఇంట్లో పనిమనిషి రవి ఆత్మహత్య**

- ఎమ్మెల్యే ఇంట్లో ఉరేసుకోవడంపై పలు అనుమానాలు
- ప్రైవేట్ బ్యాంక్ రుణం కట్టలేకే ఆత్మహత్య : సీఐ భాస్కర్
- ఎమ్మెల్యే అయిలయ్యపై హత్య కేసు నమోదుచేయాలి
- బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య డిమాండ్

**ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య స్వగృహంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకోగా శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే..**



గంధమల్ల రవి(ఫైల్)

యాదగిరిగుట్ట, జూన్ 14:ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్వగ్రామం సైదాపురానికి చెందిన రజక కులస్తుడు గంధమల్ల రవి(37), అతడి భార్య నవిత, ఇద్దరు కూతుళ్లతో కలిసి యాదగిరిగుట్టలోని ఎమ్మెల్యే అయిలయ్య ఇంట్లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల ఒక కూతురిని హాస్టల్లో ఉంచారు. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు గురైన రవి మద్యానికి బానిసయ్యాడు. నెల క్రితం మద్యం సేవించి ఇంటికి వచ్చిన రవిని ఎమ్మెల్యే భార్య మందలించినట్లు సమాచారం. దీంతో మాట మాట పెరగడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే రవిపై చేయి చేసుకున్నట్లు తెలుస్తున్నది. దీంతో అతడు అప్పుడే నెయిల్ పెయింట్ తాగి ఆత్మహత్యాయత్నం చేయగా, భువనగిరి ప్రభుత్వ దవాఖానలో చికిత్స చేయించగా ప్రాణాలతో బయటపడ్డాడని, ఈ విషయం ఎక్కడా తెలియకుండా జాగ్రత్తపడినట్లు సమాచారం.

**ఎమ్మెల్యే ఇంట్లోనే ఆత్మహత్య ఎందుకు?**

రవి రెండ్రోజుల క్రితం సైదాపురంలోని సొంత ఇంట్లోనే ఉన్నాడు. అక్కడ ఎవరూ ఉండరు. ఒకవేళ ఆత్మహత్య చేసుకోవాలనుకుంటే అక్కడే చేసుకోవచ్చు. కానీ, రెండ్రోజుల తర్వాత ఎమ్మెల్యే అయిలయ్య ఇంటికి వచ్చి మరీ ఉరి వేసుకోవడం పలు అనుమానాలకు తావిస్తున్నదని సైదాపురం గ్రామస్తులు పేర్కొంటున్నారు. రవి ఆత్మహత్యకు ముందు ఏం జరిగింది? సొంత ఊరు, ఇల్లు వదిలి ఎమ్మెల్యే ఇంట్లోకి వచ్చి ఎందుకు ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చింది అని అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా, శుక్రవారం రాత్రి ఘటనాస్థలికి వచ్చిన పోలీసులు హుటాహుటిన మృతదేహాన్ని భువనగిరి జిల్లా దవాఖానకు తరలించడం గమనార్హం.

**బ్యాంకు రుణం కట్టలేకే..: సీఐ**

మూడేండ్ల క్రితం ఓ ప్రైవేట్ బ్యాంకులో తీసుకున్న రుణం కట్టే పరిస్థితి లేకనే మనస్తాపానికి గురైన గంధమల్ల రవి ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ సీఐ భాస్కర్ వెల్లడించారు. బ్యాంకు సిబ్బంది లీగల్ నోటీసులు జారీ చేశారని, ఇంటికి వచ్చి తాళం వేస్తామని బెదిరించడంతో 15 రోజులుగా మద్యం సేవిస్తున్నాడని తెలిపారు. సైదాపురంలోనూ అప్పులు ఉన్నాయని, దీంతో ఆవేదన చెందిన రవి శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ఆత్మహత్యకు పాల్పడిన్నట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలోనే దవాఖానకు తరలించి పోస్టుమార్టం నిర్వహించినట్లు చెప్పారు. మృతుడి భార్య నవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. మృతుడి భార్య స్పందిస్తూ.. ఆర్థిక ఇబ్బందులతోనే రవి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపింది.

**హత్య కేసు నమోదు చేయాలి: కర్రె**

ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇంట్లో పనిచేసే గంధమల్ల రవి మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య పేర్కొన్నారు. శనివారం పట్టణంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఇది హత్యనా? లేక ఆత్మహత్యనా? అనేది తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యే కారణమని ఆరోపించారు. ఎమ్మెల్యే అయిలయ్యపై హత్య కేసు నమోదు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బ్యాంకు రుణం తీసుకుని కట్టలేక, బ్యాంకు సిబ్బంది ఇబ్బందులు పెడితే ఆత్మహత్యకు పాల్పడిన్నట్లు చెబుతూ తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. రాత్రికి రాత్రే మృతదేహాన్ని భువనగిరికి తరలించి పోస్టుమార్టం నిర్వహించడం అనుమానంగా ఉందన్నారు.

- పనులు పూర్తయినా..
- ప్రారంభానికి నోచుకోని వైనం
- పాడవుతున్న సామగ్రి
- కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ సర్కార్
- నీరుగారుతున్న నీరా లక్ష్యం
- ఉపాధి కోల్పోతున్న గీత కార్మికులు
- తక్షణమే ప్రారంభించాలని డిమాండ్



నందనంలోని నీరా ఉత్పత్తుల కేంద్రం

# నీరా కేంద్రంపై నీలినీడలు

**గీత కార్మికుల సంక్షేమం, వారి బతుకుల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. 7కోట్లతో నీరా కేంద్రాన్ని నందనం గ్రామం నిర్మించింది. అప్పటి ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నీరా కేంద్రం ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపారు. కల్లును ప్రాసెసింగ్ చేయడానికి కావాల్సిన యంత్ర సామగ్రిని ఏర్పాటు చేసింది.బీఆర్‌ఎస్ హయాంలోనే పనులన్నీ పూర్తయ్యాయి. ఎన్నికల కోడ్ కారణంగా ప్రారంభానికి అడ్డుకట్టపడింది. దీంతో గీత కార్మికుల ఆశయం నెరవేరలేదు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నీరా కేంద్రాన్ని పట్టించుకోవడం లేదు. ప్రారంభించడానికి కాలయాపన చేస్తున్నది. గీత కార్మికుల జీవన ప్రమాణాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నది. తక్షణమే నీరా కేంద్రాన్ని ప్రారంభించాలని గీత కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.**

భువనగిరి కలెక్టరేట్, జూన్ 14: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నందనం గ్రామంలో నీరా తాటి, ఈత ఉత్పత్తుల కేంద్రాన్ని నిర్మించింది. అందుకు అవసరమైన యంత్ర సామగ్రిని తెప్పించారు. ఈ నీరా కేంద్రం ఏర్పాటుతో యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని పలు మండలాలకు చెందిన వేలాది మంది గీత కార్మికులు, వారి కుటుంబాలకు, యువతకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని భావించారు. నీరా కేంద్రంలో తాటి, ఈత కల్లును ప్రాసెసింగ్ చేసి దేశ విదేశాలకు ఎగుమతులు చేపడుతారు. అంతేకాకుండా తాటి బెల్లం, చక్కరలతో పాటు చాక్లెట్‌లు, తాటి ఆకులతో గృహోపకరణాలు, ఆట వస్తువులను తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తారు.

**ఆరోగ్య ప్రదాయిని నీరా...**

ప్రస్తుతం మార్కెట్‌లో దొరికే అన్ని పానీయాలతో పోలిస్తే నీరా ఎంతో శ్రేష్టమైనది. అమృత ప్రదాయినిగా ప్రజలు భావిస్తారు. గీత కార్మికుల ఆధ్వర్యంలో సేకరించే స్వచ్ఛమైన తాటి, ఈత కల్లును సూర్యోదయానికి ముందే సేకరించి నీరా కేంద్రానికి తరలించి అక్కడ ఉన్న మిషనరీల ద్వారా ప్రాసెసింగ్ చేసి ఎలాంటి కల్తీకి ఆస్కారాలు లేకుండా స్వచ్ఛమైన నీరాను ప్రత్యేకంగా తయారుచేసి విక్రయాలు చేపడుతారు. నీరాకు మన దేశంతో పాటుగా ఇతర దేశాల్లో ఎంతో డిమాండ్ ఉన్నది. అంతటి ప్రాధాన్యత కలిగిన నీరా ఉత్పత్తి కేంద్రాన్ని ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

**పాడవుతున్న సామగ్రి...**

బీఆర్‌ఎస్ ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమం, ఆర్థిక ఎదుగుదలను కాంక్షించి ఏర్పాటు చేసిన నీరా కేంద్రంలో కోట్ల రూపాయలతో నీరా ప్రాసెసింగ్ యూనిట్‌కు సంబంధించిన యంత్రాలను సమకూర్చింది. అప్పట్లో అనివార్య కారణాలతో ప్రారంభానికి నోచుకోని నీరా ప్రాసెసింగ్ యూనిట్‌కు కాంగ్రెస్ పాలనలో గ్రహణం పట్టింది. కేంద్రంలోని మిషనరీ పాడయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

### తక్షణమే ప్రారంభించాలి

నందనంలో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన నీరా ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలి. రూ. 7కోట్లతో నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో జరిగినా ఇప్పటికీ ప్రారంభించకపోవడం దురదృష్టకరం. కల్లు గీత కార్మిక సంఘం పోరాట ఫలితంగా గతంలో నందనంలో నీరా ప్రాజెక్టు ఏర్పాటు చేసింది. గీత కార్మిక కుటుంబాల్లో వెలుగులు నింపే బృహత్తర పథకం ఇది.

- జయరాములు

### ఉపాధి అవకాశాలు మెరుగు

నీరా కేంద్రం ఏర్పాటుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి. గీత కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే నీరా కేంద్రం ఏర్పాటు చర్యలు చేపట్టింది. గీత కార్మిక కుటుంబాలకు ఆర్థికంగా ఉపయుక్తంగా ఉన్న నీరా కేంద్రాన్ని అన్ని హంగులతో ప్రారంభించి ఉపయోగంలోకి తీసుకురావాలి.

- లక్ష్మీనారాయణ గౌడ్

## మాకియ్యరా ఇందిరమ్మ ఇల్లు




ఏనుబాముల పంచాయతీ ఎదుట గుడిసె వేసి నిరసన తెలుపుతున్న పాండురంగన్న కుటుంబం

ఆత్మకూర్.ఎస్, జూన్ 14: ఇందిరమ్మ ఇల్లు రాలేదని సూర్యాపేట జిల్లాలోని ఏనుబాముల గ్రామానికి చెందిన కలకొట్ల పాండు రంగన్న శనివారం వినూత్నంగా నిరసనకు దిగాడు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట తాటి కమ్మలతో గుడిసె వేసి భార్యాపిల్లలతో బైఠాయించాడు. ఇటీవల మంజూరైన 33 మంది ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరు లేకపోవడంతో ఆవేదన చెందాడు. కూలీ పనులు చేసుకునే తమ కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తక్షణమే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరాడు. ఎన్నో రోజులుగా గ్రామ నాయకులు, అధికారుల చుట్టూ తిరిగానని.. వారంతా ఇల్లు ఇప్పిస్తామని మాటిచ్చి తీరా జాబితాలో పేరు రాకుండా చేశారని ఆరోపించారు. కాగా ఇందిరమ్మ కమిటీ నిర్ణయం మేరకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు ఎంపీవో రాజేశ్ తెలిపారు.

# తాగి నడిపితే జైలుకే!

**దడ పుట్టిస్తున్న డ్రంకెన్ డ్రైవ్**

**పోలీసుల విస్తృత తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు**

**సూర్యాపేట జిల్లాలో 6,425 కేసులు, 33 మందికి జైలుశిక్ష**



పలువురు వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండడంతో ప్రమాదాలు జరిగి వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ఈక్రమంలో ప్రమాదాల నియంత్రణకు పోలీస్‌శాఖ డ్రంకెన్ డ్రైవ్ చేపట్టింది. బ్రీత్ ఎనలైజర్లతో ఆల్కహాల్ పరీక్ష చేసి మద్యం తాగిన వారిపై కేసులు నమోదుచేసి జైలుశిక్ష పడేలా చేస్తున్నది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం జనవరి నుంచి మే వరకు సుమారు 6,424 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. జరిమానాలతో ప్రభుత్వానికి రూ.40.85 లక్షల ఆదాయం రాగా, మొత్తం 33 మందికి జైలుశిక్ష పడింది. డంకెన్‌డ్రైవ్‌తో వాహనదారుల్లో కొంత మార్పు వచ్చిందని అధికారులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. -నేరేడుచర్ల, జూన్ 14

**జంకుతున్న వాహన చోదకులు**

గతంతో పోలిస్తే వాహనచోదకులు రాత్రి అవుతుందంటే చాలు.. డ్రంకెన్ డ్రైవ్ కేసులతో జంకుతున్నారు. వాహనచోదకులకు సైతం అవగాహన కలగడంతో వారిలోనూ మార్పు వస్తున్నది. పోలీసుల చర్యలతో నాలుగుచక్రాల వాహనదారులు డ్రైవర్ లేకుండా ప్రయాణం చేయడం లేదంటే అతిశయోక్తి కాదు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. మద్యం తాగి డ్రైవ్ చేస్తున్నవారికి జరిమానా తప్పదని తెలిసి చాలా మంది తాగి నడపడం తగ్గించారు. మరికొందరు మద్యం సేవించి పోలీసులు ఉన్నవైపు వెళ్లకుండా ఇతర మార్గాలను ఎంచుకుంటున్నారు.

**పోలీసుల అవగాహన కార్యక్రమాలు**

మద్యం సేవించి వాహనాలను నడపంతో కలిగే అనర్థాలు, నష్టాలపై పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిత్యం పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ బ్రీత్ ఎనలైజర్‌తో ఆల్కహాల్ పరీక్ష చేసి తాగిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఆటో, కారు స్టాండ్ల వద్ద, ప్రజలు రద్దీగా ఉన్నచోటకు వెళ్లి పోలీసులు అవగాహణ కల్పిస్తున్నారు. అయినా, కొంత మందిలో మార్పు రాకపోవడం గమనార్హం.




**మద్యం తాగి వాహనాలు నడపొద్దు**

వాహనదారులు ఎట్టిపరిస్థితుల్లో మద్యం తాగి వాహనాలు నడపొద్దు. అలా చేస్తే చట్టరీత్యా నేరం. అంతేకాకుండా అనుకోని ప్రమాదం ఏదైనా జరిగితే కుటుంబాలు వీధిన పడతాయి. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడితే న్యాయస్థానాలు జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తాయి.

- చరమందరాజు, సీఐ, హుజూర్‌నగర్

## దివిస్‌కు ఉత్తమ రక్తదాన అవార్డు

**రాజ్‌భవన్‌లో అందజేసిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**

చౌటుప్పల్/రామగిరి, జూన్ 14: చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లింగోజిగూడెంలోని దివిస్ పరిశ్రమకు రాష్ట్ర ఉత్తమ రక్తదాన అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన ప్రపంచ రక్తదాన దినోత్సవంలో భాగంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు పరిశ్రమ మేనేజర్ పెండ్యాల సుధాకర్ శనివారం తెలిపారు. గత పదేండ్లుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి అధికంగా బ్లడ్ యూనిట్స్ అందించినందుకు ఈ అవార్డు దక్కిందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు డాక్టర్ నటరాజ్, డాక్టర్ అమరేందర్‌రెడ్డి, దివిస్ లైసన్ ఆఫీసర్ కిశోర్‌కుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న దివిస్ పరిశ్రమ ప్రతినిధి

## వరకట్న వేధింపులతో మహిళ ఆత్మహత్యాయత్నం

- గుర్తించి ప్రాణాలు కాపాడిన పోలీసులు
- నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీలో ఘటన

నందికొండ, జూన్ 14: సకాలంలో పోలీసులు స్పందించి మహిళ ప్రాణాలు కాపాడిన ఘటన నాగార్జునసాగర్‌లో శనివారం చోటు చేసుకున్నది. స్థానిక విజయపురి పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీకి చెందిన జస్విత(28).. భర్త, అత్తమామల వరకట్న వేధింపులకు తాళలేక ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకొని తన కారులో ఒంటరిగా ఇంటి నుంచి బయల్దేరి మధ్యాహ్నం నాగార్జునసాగర్ చేరుకున్నది. తనతోపాటు తెచ్చుకున్న విషం తాగి చివరి నిమిషంలో తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాను చనిపోతున్నట్లు తెలిపింది. జస్విత తండ్రి సూర్య వెంటనే కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వగా వారు విజయపురి పోలీసులను అప్రమత్తం చేశారు. ఎస్‌ఐ సంపత్ తన సిబ్బందితో కలిసి టెక్నాలజీ సాయంతో పైలాన్‌కాలనీలోని జెన్‌కో ఏటీఎం సమీపంలో కారును గుర్తించారు. అక్కడికి వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను స్థానిక కమలానెహ్రూ దవాఖానకు తరలించారు. ఆ తర్వాత మహిళ తల్లిదండ్రులు నాగార్జునసాగర్ చేరుకొని మెరుగైన చికిత్స కోసం జస్వితను హైదరాబాద్ తీసుకెళ్లారు. సకాలంలో స్పందించిన విజయపురి ఎస్‌ఐ సంపత్‌గౌడ్, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



దవాఖానలో చికిత్స పొందుతున్న జస్విత

## ఎమ్మెల్యే పల్లా కోలుకోవాలని
# పాదయాత్ర

రాజాపేట, జూన్ 14 : ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో ప్రమాదవశాత్తు జారిపడిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కాలికి గాయాలయ్యాయి. దవాఖానలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే పల్లా త్వరగా కోలుకోవాలని శనివారం జనగామ జిల్లా చేర్యాల మండలానికి చెందిన భూమిగాని రాజేందర్ చేర్యాల నుంచి యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. అతని పాదయాత్ర రాజాపేట మండలానికి చేరుకున్న సందర్భంగా నేమిల క్రాస్ రోడ్ వద్ద బీఆర్‌ఎస్వీ ఆలేరు నియోజకవర్గ నాయకుడు మోత్కుపల్లి బాలకృష్ణ ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వరిమడ్ల బాలకృష్ణ, శ్రీకాంత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



రాజాపేటలో పాదయాత్ర చేస్తున్న రాజేందర్‌కు స్వాగతం పలికి సన్మానిస్తున్న బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ నాయకుడు బాలకృష్ణ

## మోత్కూరు ఎస్సైపై బదిలీ వేటు

**ప్రొబెషనరీ ఎస్సై నోయల్‌రాజ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు**

మోత్కూరు, జూన్ 14 : మోత్కూరు ఎస్సై దొమ్మాట నాగరాజుపై బదిలీ వేటు పడింది. ఈ మేరకు శనివారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఉత్వర్వులు జారీ చేశారు. ఈ నెల 6న మండలంలోని ముశిపట్లలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య వాట్సాప్ గ్రూప్‌లో చోటుచేసుకున్న ఘటనతోపాటు రాగిబావి గ్రామంలో జరిగిన భూవివాదంలో ఎస్సై నాగరాజు అలసత్వం ప్రదర్శించారన్న ఆరోపణలున్నాయి. ఈ మేరకు బాధితులు సీపీ సుధీర్‌బాబుకు ఫిర్యాదు చేయడంతో నాగరాజును హైదరబాద్‌లోని అంబర్‌పేట్ హెడ్‌క్వార్టర్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ప్రొబెషనరీ ఎస్సై నోయల్‌రాజ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.